- నమస్తే తెలంగాణ.. తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహణ
- వేణుమాల్‌లో రెండురోజుల పాటు కొనసాగిన ప్రాపర్టీ షో
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జిల్లావాసులు
- ఒకే వేదికపై కొలువుదీరిన ప్రముఖ రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ సంస్థలు


ప్రాపర్టీ షోలో సందర్శకుల సందడి

# ప్రాపర్టీ షో అదుర్స్




ప్లాట్ కొనుగోలు చేసిన వారికి డాక్యుమెంట్స్ అందజేస్తున్న స్టాల్ నిర్వాహకులు

ఖలీల్‌వాడి, మార్చి 9: నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని వేణుమాల్‌లో నమ స్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాపర్టీ షోకు అనూహ్య సందన వచ్చింది. రెండు రోజులపాటు నిర్వహించిన ప్రాపర్టీషో ఆదివారం ముగిసింది. నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డెవలపర్స్, రియల్‌ఎస్టేట్ సంస్థలు తరలివచ్చాయి. ప్రదర్శనలో 22 సంస్థలు కొలువుదీరాయి. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో ప్రాపర్టీ షో సందడిగా మారింది. వివరాలు తెలుసుకునేందుకు స్టాళ్ల వద్ద బారులు తీరారు. తమ అభిరుచులకు అనుగుణంగా ఉన్న నిర్మాణాలను ఎంచుకున్నారు. ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు అందుబాటు ధరలో ఉండడంతో కొనుగోలుకు ఆసక్తి చూపారు. ప్రాపర్టీస్ కొనుగోలు చేసేవారి కోసం రుణ సదుపాయం కల్పించడానికి ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశాయి. నిజామాబాద్, హైదరాబాద్ మార్గంలో చేపడుతున్న పలు నిర్మాణ రంగాల ప్రాజెక్టుల్లో మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ధరలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. నూతన ఇండ్ల నిర్మాణం, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు సంబంధించి ఆయా సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ సంస్థలను ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి, ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిన నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేను సందర్శకులు అభినందించారు.



**నగరవాసులకు అందుబాటులో..**

నిజామాబాద్ నగరవాసులకు వ్యయభారం కాకుండా వినూత్న ఆలోచనలతో నమస్తే తెలంగాణ , తెలంగాణ టుడే ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నది. ప్రతి సంవత్సరం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల ముందుకు ఆటోషో తీసుకువస్తున్నది. ఆటోషోలో కొనుగోలు దారుల అభిరుచులకనుగుణంగా వివిధ కంపెనీల వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. అన్ని పర్మిషన్లు ఉన్న సంస్థలకే ప్రాపర్టీ, ఆటోషోల్లో అనుమతిస్తున్నది. ప్రజలు మోసపోకుండా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ముచ్చటగా మూడో సారి ప్రాపర్టీ షో నిర్వహించినట్లు నిజామాబాద్ నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ ధర్మరాజు తెలిపారు. కార్యక్రమంలో నమ స్తే తెలంగాణ బ్యూరో చీఫ్ జూపల్లి రమేశ్, ఏడీవీటీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఒకే వేదికపై కొలువుదీరిన ప్రముఖ కంపెనీలు**

మెయిన్ స్పాన్సర్ వాసవి గ్రూప్స్, కో -స్పాన్సర్ శ్రీ వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్(ఎస్‌వీసీ), మకుట బిల్డర్స్ (క్రౌన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్), అసోసియేషన్ విత్ : శ్రీ అశోకా బిల్డర్స్ అండ్ డెవలపర్స్, ఐశ్వర్యం హోమ్స్, రాయల్ ఓక్ నిజామాబాద్, బాలాజీ డివైన్, ఏపీడీ డెవలపర్స్, శ్రీ గోవిందసాయి బిల్డర్స్ అండ్ డెవలపర్స్, శ్రీ ఎస్ఎల్ ఎన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, అంకురమ్, భూమి స్పేస్, సన్‌యుగ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ నార్త్ క్రెస్ట్, మయూర సూపర్ లివింగ్, ఆదూరి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పాటు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటాపవర్ సోలారూఫ్, కపిల్ ప్రాపర్టీస్, టీఎంఆర్ గ్రూప్, అక్షయ ఎంటర్ ప్రైజెస్ స్టాళ్లు ఏర్పాటు చేశారు.


స్టాళ్ల వద్ద వివరాలు తెలుసుకుంటున్న సందర్శకులు


లక్కీ విజిటర్ డ్రా తీస్తున్న ఓ చిన్నారి





## పొలం వద్దకు వెళ్తే కన్నీళ్లే..

ఈ చిత్రంలోని రైతు పేరు నవీన్ పటేల్. స్వగ్రామం డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి. తనకున్న మూడు ఎకరాల్లో వరి, ఎనిమిది ఎకరాల్లో మక్కజొన్న పంట వేశాడు. చివరి తడులకు రాకముందే రెండున్నర ఎకరాల వరి ఎండిపోయింది. అంతవరకు బాగా పోసిన బోరు సైతం ఎత్తిపోయింది. కనీసం అర ఎకరం పంటనైనా కాపాడుకోవాలన్న ఉద్దేశంతో చుట్టుపక్కల ఉన్న రైతుల బోర్ల నుంచి నీరు అడిగాడు. కానీ వారికి చెందిన బోర్లు కూడా ఎత్తిపోవడంతో చేసేదేమీలేక పొలం వద్దకు వెళ్లడమే మానేశాడు.

# పంట పశువుల పాలు

- యాసంగిలో సాగునీటి కష్టాలు
- చేతికందే దశలో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

మాచారెడ్డి/ డిచ్‌పల్లి, మార్చి 9 : భూమిని నమ్ముకొని కోటి ఆశలతో, అప్పు చేసి సాగు చేసిన పంట కండ్ల ముందే ఎండిపోతున్నది. దీంతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. సాగునీరు అందక చేతికి అందే దశలో పంట ఎండిపోవడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీటి వనరుల లభ్యత లేకపోవడం, సాగునీరు అందించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బోర్లలో నీళ్లు రాక, వేసని పంటలను కాపాడుకోలేక దిగాలు చెందుతున్నారు. యాసంగి సాగులో నీటి కష్టాలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. డిచ్‌పల్లి మండలం ముల్లంగి, పాల్వంచ మండలంలోని పోతారం గ్రామంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సాగునీటి కోసం ఎన్ని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నా ఫలితం లేకపోయింది. కండ్ల ఎదుటే పంట ఎండుతుంటే ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఎండిపోయిన పంటలు పశువులకు మేతగా మారాయి. అప్పు చేసి బోర్లు మరమ్మతులు చేపట్టినా చుక్కనీరు రావడంలేదు.


ఎండిపోయిన పంటలో మేత మేస్తున్న పశువులు

### రూ.లక్ష ఖర్చుచేసినా ఫలితంలేదు..



మూడెకరాల్లో వరి పంట వేశాను. బోర్ మోటర్‌లో నీరు రాకపోవడంతో రూ.లక్ష ఖర్చు చేసి ఫ్లషింగ్ చేయించిన. చుక్కా నీరు రాలేదు. పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీలేక పశువులను మేతకోసం ఎండిన పోలంలోకి వదిలిన.

**-ఉబ్బనగారి లింగం, పోతారం, పాల్వంచ మండలం**

### బోరు వట్టిపోవడం ఇదే తొలిసారి



నేను వ్యవసాయం చేస్తున్నప్పటి నుంచి మా పొలంలోని బోరు ఎప్పుడు ఎండిపోలేదు. వేసిన రెండెకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. ఎండిన పంటను పశువులు మేస్తున్నాయి. నాకు రుణమాఫీ కూడా కాలేదు. రైతుభరోసా కూడా అందలేదు. మా రైతుల పరిస్థితి ఆగమాగంగా మారింది. ప్రభుత్వం పట్టించుకుంటలేదు. మమ్మల్ని ఆ దేవుడే కాపాడాలి.

**-ఇంటెనుక కిషన్, పోతారం, పాల్వంచ మండలం**

# కల్లూర్‌లో నీటి కష్టాలు

- 15 రోజుల నుంచి నిలిచిపోయిన సరఫరా
- పొతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన

పొతంగల్, మార్చి 9: మండలంలోని కల్లూర్‌లో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిందెడు నీటి కోసం మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఓ కాలనీలో పదిహేను రోజులుగా తాగు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో సుమారు వంద కు పైగా ఇండ్లు ఉన్నాయి. అధికారులు, వాటర్ మన్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ మహిళలు, ప్రజలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. నీళ్ల కోసం పనులు మానుకొని రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### నీళ్ల కోసం రోజు పడిగాపులు



15 రోజుల నుంచి బిందెడు నీళ్ల కోసం నానా తంటాలు పడుతున్నాం. దూరంగా ఉన్న పంట పొలాల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. దినంలో నల్లాలు ఎప్పుడొస్తాయో తెలియక రాత్రింబవళ్లు నీళ్ల కోసం పనులు మానుకొని పడిగాపులు కాస్తున్నాం. గ్రామానికి వచ్చే అధికారిని అడిగితే పట్టించుకోవడం లేదు. మా నీటి గోస ఎవరికి చెప్పుకోవాలో సమజైతలేదు. దండం పెట్టి అడుతున్నా పెద్దసార్లు జర నీటి సమస్య తీర్చాలి.

**-తెనుగు లింగవ్వ, కల్లూర్**


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కల్లూర్ గ్రామస్తులు

### ప్రత్యేకాధికారి రారు.. పట్టించుకోరు



ప్రత్యేకాధికారుల పాలన వచ్చినప్పటి నుంచి గ్రామంలో తాగునీటి సమస్యతో పాటు పారిశుద్ధ్య పనులు పట్టించుకోవడం లేదు. వీధి లైట్లు వెలగడం లేదు. గ్రామానికి పుష్కలంగా నీరు అందించే అవకాశం ఉన్నా.. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగు నీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

**-మక్కయ్య, కల్లూర్,**

## ఎండిపోయిన మొక్కలు..
# ధ్వంసమైన కంచెలు

పచ్చదనం పెంపులో అటవీశాఖ పాత్ర కీలకం. కానీ అటవీశాఖ ఆఫీస్ చుట్టూ నాటిన హరితహారం మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ సౌత్ కార్యాలయం చుట్టూ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. వాటిని సంరక్షించాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. మొక్కల చుట్టూ ఏర్పాటు చేసిన కంచెలు కూడా ధ్వంసమయ్యాయి. మొక్కలనే సంరక్షించని అటవీశాఖాధికారులు..అడవుల్లో ఉన్న చెట్లను ఎలా కాపాడుతారని స్థానికులు పేర్కొంటుండడం గమనార్హం.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ సౌత్ కార్యాలయం చుట్టూ ఎండిపోయిన మొక్కలు

# తిలక్‌గార్డెన్‌లో చెలరేగిన మంటలు

- అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- భయంతో పరుగులు తీసిన పర్యాటకులు

వినాయక్‌నగర్, మార్చి 9: నిజామాబాద్ నగర నడిబొడ్డున ఉన్న తిలక్‌గార్డెన్ పార్క్‌లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గార్డెన్‌లోని ఎడమ వైపు భాగంలో ఎండుగడ్డితోపాటు చెట్లకు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఏం జరిగిందోనని పార్క్‌లో ఉన్న సందర్శకులు పరుగులు తీశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సాయంత్రం సమయంలో గార్డెన్‌కు పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటా హుటిన అక్కడికి చేరుకున్నారు. గార్డెన్‌లో మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. అసలు మంటలు ఎలా అంటుకున్నాయనే విషయం అంతు పట్టడంలేదని పార్క్ నిర్వాహకులు పేర్కొన్నారు. పార్క్‌కు వచ్చిన వారిలో ఎవరో పోకిరీలు ఉద్దేశపూర్వకంగానే అక్కడ నిప్పంటించి ఉంటారనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రమాదంలో సందర్శకులకు ఎలాంటి హాని జరకగపోవడంతో పార్క్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.


తిలక్ గార్డెన్‌లో చెలరేగుతున్న మంటలు